


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -170-

**(15 ఏప్రిల్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**శ్రీ రామనవమి సీతారాముల** కళ్యాణం ప్రజల నోముల జంట – వేదకాలపు పంట

భారతదేశం ఎన్ని విధాలుగా బీదదై పోయినా ధర్మాలు అరుదైపోయినా, పితృభక్తి వంటి ఉత్తమస్థితి చెదిరిపోతున్నా ఇంకా శ్రీరామభక్తి కొరత పడలేదు. కొందరు అక్కడక్కడా విముఖత ప్రదర్శించినా వెలితి మాత్రం కనిపించదు.

పసిపిల్లవాడు, ఒక్కొక్కప్పుడు తను ఆడుకునే బొమ్మను దాచివేసి "యేది? ఎక్కడో పోయింది. పోనీ మీరు కనుక్కోండి చూద్దాం" అంటూ అభినయిస్తూ వుంటాడు. ఇవతల వాళ్ళు చూపించినా, లేక కొంతసేపటికి తనే తీసి చూపించినా సరే సంతోషం పట్టలేక పకపకలాడతాడు.

అలాగే కొందరు భక్తులు భగవంతుణ్ణి మనస్సులో దాచివేసి "ఏడీ ఎక్కడున్నాడు కనిపించడంలేదే? మీరు కనుక్కోండి చూద్దాం" అని ఆడుతూ వుంటారు. ఆధ్యాత్మపరమైంది ఆట చివరకు వారే భగవంతుని బయటపెట్టి పకపకలాడతారు.

మొత్తం మీద మనకు "రామనామం" పంట సమృద్ధిగా పండుతోంది. ఎన్నెన్ని హృదయాలలోనో పండుతోంది. ఎల్లవేళలా పండుతోంది – ఏటేటా ఆ పంట గరిసెలు నింపుతోంది. అంతకన్నా పండగ ఏం వుంటుంది?

రామనామంలో గల పరమశక్తిని గురించి అనేక విధాలుగా వర్ణించబడింది ఈశ్వరుడు తన పతి అయిన పార్వతికి రామనామం ఉపదేశించినట్లు స్కాంద పురాణంలో వుంది. "రెండు అక్షరాలు గల రామనామం పాపాలను పోగొడుతుంది. నడుస్తున్నా, కూర్చున్నా, పడుకుని వున్నా రామనామం జపించి జపించి ముక్తి సంపాదించవచ్చు. వెయ్యి వేద ప్రవచనాలకు మించిన శక్తి రామనామంలో వుంది కనుక పార్వతీ రామనామం జపించు" అని పరమశివుడు ఉపదేశించాడు.

చంద్రశేఖరుడంతటివాడు భార్యకి రామమంత్రం ఉపదేశించాడు గనుక ఇతరులకు సందేహాలుండవలసిన పనిలేదు. మనకు రామనామం సులభతరమైన మంత్రం మహనీయులెందరో రామనామానికి తగినంత ప్రచారం చేశారు. ఆ నామంలో గల పవిత్రతను అభివర్ణించారు. జనులు జపించడం ఒక్కటే తరువాయి.

మనకు భద్రాచల రాముదున్నాడు ఆయనకు చెందిన గాథలు, కథలూ అనేకం ఉన్నాయి. మనకు రామదాసున్నాడు. ఆయన రచించిన కీర్తనలున్నాయి. ఆ పాటలు ప్రతి నోటా మెదులుతూ వుంటాయి చైత్రం రాగానే శ్రీరామనవమి మనస్సుల్లో మెదలుతుంది. అశేష భక్తులు అదుగో భద్రాద్రి.. గౌతమి చూడండి అంటూ పరవశంతో పరుగులు తీస్తూ వుంటారు .అక్కడ గొప్పగా కళ్యాణం జరుగుతుంది. ఆ ముక్తి ప్రదాత, సీతామాతా ముత్యాల తలంబ్రాలు పోసుకుంటారు అది దేశానికి ప్రజాళికి అంతులేని శాంతి కల్పిస్తుంది.

భద్రాచలం మూల కేంద్రం కాని ప్రతి గ్రామం ప్రతి వీధి శ్రీరామనవమి నాదు చిన్న భద్రాచలమైపోతుంది. ఎందరెందరో భక్తులు స్వామికి కళ్యాణం చేసి తన్మయులవుతారు. భజనలు, ప్రార్ధనలు, కాలక్షేపాలూ, పౌరాణిక నాటకాలూ. వీనులకు విందు చేస్తాయి ఈ బ్రతుకునే మరిపిస్తాయి. రామనామ జపించని వాడు ఏ మారుమూలా కనిపించదు.

శ్రీరామనవమి నాడు ఎటు చూసినా రామభక్తులే త్యాగరాజుగారన్నట్లు "ఎందరో మహానుభావులు వారందరికీ వందనములు" అని పాడుకుంటుంది మనస్సు – కంక ప్రక్క సిగ్గుపడుతూ ఒక ప్రక్క భక్తిపథంలోకి మొగ్గుతూ ..

మ్రొక్కాలంటే ఎక్కడ లేదు రాముదు. ఎప్పుడు లేదూ.

తులసీదాసు ఏమన్నాదు.

"అనల, అనిల, జల, రవి, శశి, తారే
ఫృధ్వీగగన, గంధరసపారే
తుజు సరితాకే సబ్ ఫవ్వారే
తు సబ్‌కా విశ్రాం"

"అగ్ని, గాలి జలము, సూర్యుదు, చంద్రుదు, తారలు, భూమి, ఆకాశం గంధరస సారం. ఇవన్నీ నీవనే నదిలోని చిరుకెరటాలు. నీవే అన్నిటికీ మూలాధారం.

ఇలా ఎల్లతావులా నిండివున్న రామలీలలను వర్ణించి, తరించడం ఎంతో తేలిక పనిగా కనిపిస్తుంది కాని, రాను రాను రామనామ జపం తరిగిపోకుండా కాపాడుకోవలసిన అవసరమెంతైనా వుంది. విదేశాలనుంచి ఏదైనా దిగుమతి చేసుకోవచ్చుగాని, భక్తిని దిగుమతి చేసుకోలేం కదా అందువల్ల 'భక్తి విషయంలో కూడా అధికోత్పత్తి ప్రణాళికలు అమలు పరచాలి. ఈ కార్య క్రమాన్ని విజయవంతంగా నిర్వహించగల మహనీయులు భక్తులు ఇంకా కొందరు అవసరం.

శివుడే పార్వతీదేవికి రామనామం బోధించాదు ఆ ఆదర్శాన్ని అందుకుని ప్రతి గృహస్తు తన ఇల్లాలికి రామనామ మంత్రం ఉపదేశించాలి. వారు పిల్లలకు ఉపదేశించాలి. ఆ విధంగా కొంత ప్రచారం జరుగుతోంది.

ఈ మాట అంటే ఒక గృహస్థు అన్నాడు "ఈ సంసారాలలో రామనామం ఉపదేశించే స్థిమితం ఎక్కడుందండీ? తెల్లారి లేస్తే ఎన్ని సమస్యలు? నిద్రలో కూడా మతి సరిగ్గా వుండటం లేదు. ఇలాంటి స్థితిలో "రామా అనవే భామా" అంటే ఎవరు వినిపించుకుంటారు, ఎలా మనస్సుకి పట్టించుకుంటారు?" అన్నాడు.

ఈ సందర్భంలో ఒక విషయం జ్ఞాపకం వచ్చింది. హైదరాబాద్‌లో మేమున్న ఇంట్లో ప్రక్క భాగంలో చదువుకున్న దంపతులున్నారు వారు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారట అందువల్ల మొదటి నుంచీ పేర్లు పెట్టి పిలుచుకోవడం అలవాటట.

అందుకని ఆవిడ "రామం, రామం" అని ఆయన్ని పిలుస్తూ వుండేది. క్రొత్తలో రామనాపం జపిస్తుందనుకున్నాం, తర్వాత ఆయన పేరది అని తెలిసింది. ఆయన గారిమీద ఆవిడకు కాలివేసినప్పుడు "అయ్యో నా రామం" అంటూ వుండేది. ఇదొక విధమైన నామజపం.

రామనామాని – దివ్య ఔషధంలాగా వాడుకుని తరించిన వారున్నారు కాని అంత దీక్షగలవారు ఎవరని ప్రశ్నిస్తూ వుంటారు చాలామంది ఎవరిమాటో దేనికి భారత జాతిపిత మహాత్మాగాంధి రామనామాన్ని ఒక క్షణం కూడా విడిచి పెట్టలేదు. "రఘురపతి రాఘవ రాజా రాం" కీర్తన ఆయనకు ఎంతో శక్తిని చైతన్యాన్ని అందించింది.

ఆయన అనుచరులలో ఎవరూ అంతగా రామనామాన్ని స్మరించినట్లు కనిపించదు కాని చాలామంది 'రామ! రామా అని వారు స్మరించకపోయినా "అయ్యో రామా! అనే పనులు చాలా చేస్తున్నారు. దేశపరిస్థితులు గమనించి ప్రజలు "రామా రమా" అనుకునే పరిస్థితులు కూడా చాలా కల్పిస్తున్నారు. ఈ విధంగా ప్రజల్లో రామస్మరణకు తావు కల్పించారు అదీ కొంత పుణ్యమేనేమో.

గాంధీజీ రామరాజ్యం స్థాపించాలని కోరారు. ఆయన అనుయాయులు, వారి అనుచరులూ – తమతమ 'క్షేమరాజ్యం' స్థాపించుకుంటున్నారు. అది కుదరని వాళ్ళు దేశంలో కొద్దిపాటి మరుక్షేత్రాలు సృష్టిస్తున్నారు.

అంతా శ్రీరామచంద్ర ప్రభువు దయ.

Post your comments